క్లుప్తంగా

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జయమ్మ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ, వీరశైవ లింగాయత్ చౌకిమఠం అధ్యక్షుడు మల్లన్నలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు గంట శివయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి జగదీశ్వర్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న రోజా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజా ఆదివారం పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వార్డు సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శారద, భాస్కర్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



కిట్లును అందజేస్తున్న సురేందర్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం మాదారం గ్రామంలో ఔత్సాహిక క్రీడాకారులకు మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్ క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులకు తమ సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. అనంతరం శుభకర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచి త మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బంది గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

10 నుంచి ఓపెన్ టు ఆల్ క్రీడాపోటీలు

జిన్నారం (పటాన్‌చెరు): జాతీయ యువజన వారోత్సవాలను పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రంలో వివేకానంద విగ్రహావిష్కరణ, ఓపెన్ టు ఆల్ వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ. 50,000 ద్వితీయ బహుమతిగా రూ.30,000 తృతీయ బహుమతిగా రూ.15వేలు అందించనున్నట్లు తెలిపారు. పోటీలు జనవరి 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. వాలీబాల్ పోటీల కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ 8019230338, 9849109338, కబడ్డీ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000, విష్ణువర్ధన్ రెడ్డి 98852 29962లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, మొగులయ్య, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): క్షయవ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని గుమ్మడిదల మండల వైద్యాధికారి మధుకర్ అన్నారు. నేడు అన్నారం గ్రామపంచాయతీ ఆవరణలో క్షయ వ్యాధికి క్యాంపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు 2 వారాలకు మించి జ్వరం తగ్గకపోవడం, శరీర బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు ఉన్నవారు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ప్రజా పోరాటాలతో మరింత ముందుకు..

పటాన్‌చెరు టౌన్: ప్రజాపోరాటాలతో మరింత ముందుకు తీసుకెళ్తామని మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో పార్కర్ యూనియన్ కార్మికులు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్ర జా పోరాటాలను బలోపేతం చేస్తామన్నారు. ప్రజాసమస్యలపై నిత్యం ఉద్యమిస్తున్న పార్టీ సీపీఎం మాత్రమేనని అన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

'తెల్ల'బోతున్న పత్తి రైతు

- సీసీఐ ధర రూ.7,521
- ఇస్తుంది మాత్రం రూ.7 వేల లోపే..
- నిరాశలో అన్నదాతలు

జహీరాబాద్ టౌన్: ఆరుగాలం కష్టపడి పత్తి పంటను సాగు చేసి అమ్ముకునే సమయంలో రైతులకు నిరాశే మిగుతోంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంట దిగుబడి సరిగ్గా రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు గిట్టుబాటు ధర కూడా దక్కకపోవడంతో నష్టపోవాల్సి వస్తుంది. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయింది. పెసర, మినుము పంటలు పూర్తిగా దెబ్బతినగా పత్తి పంట దిగుబడిపై ప్రభావం చూపింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. పూత, కాత దశలో ఉన్నప్పుడు భారీ వర్షాలు కురువడంతో పత్తికి తీవ్ర నష్టం జరిగింది. ప్రస్తుతం చేతికి వచ్చిన పంటకు మార్కెట్‌లో సరైన ధర లేదు. జిల్లాలో సుమారు 3.50 లక్షల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. సాధారణంగా పత్తిలో ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉంది. వర్షాల కారణంగా ఏడు ఎనిమిది క్వింటాళ్లకు మించి రావడం లేదు. గత ఏడాదితో పోల్చితే సగానికి సగం పడిపోయింది. కూలీల కొరత వల్ల కూడా రైతులు నష్టపోవాల్సి పరిస్థితి. స్థానికంగా కూలీలు లేక ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు. కూలీలు కేజీ పత్తికి రూ.12 నుంచి 14 వరకు తీసుకున్నారు. విత్తనాలు, పురుగు మందులు, కూలీలు తదితర ఖర్చులు విపరీతంగా పెరిగాయి.

గిట్టుబాటు ధర లేదు..

రైతులు దళారుల బారిన పడకుండా ఉండేందుకు సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తిని సేకరిస్తుంది. రాయికోడ్, నారాయణఖేడ్, సదాశివపేట, మునిపల్లి, వట్‌పల్లి, జోగిపేట, తదితర ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంట దిగుబడి తగ్గిన ధర ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశించారు. కానీ సోయాబీన్ మాదిరిగా పత్తి పంటకు కూడా గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 నిర్ణయించారు. కానీ రూ.7 వేల లోపే చెల్లిస్తున్నారు. 8 శాతం కన్న తక్కువ తేమ ఉన్న పత్తిని సీసీఐ కేంద్రాల్లో తీసుకుంటున్నారు. తేమ అధికంగా ఉంటే ధరలో కోత విధిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 9 వేలకు పైగా ఉన్న బహిరంగ మార్కెట్‌లో రూ. 6 వేలు మాత్రమే ఇస్తున్నారు. భారీ నష్టాలు చవి చూడడంతో అన్నదాతలు కంట తడిపెట్టుకుంటున్నారు.



తేమశాతాన్ని పరిశీలిస్తున్న అధికారి

కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నారాయణఖేడ్: కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి కోరారు. ఆదివారం ఖేడ్‌లోని భూగొండేశ్వర చౌక్‌లో మహాత్మా భూంగొండేశ్వరకూడలి ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాకటలోని బీదర్ జిల్లాలో కురుమకులంలో జన్మించిన భూంగొండేశ్వర దేశం కోసం, జాతికోసం, ధర్మం కోసం నిస్వార్థకంగా పోరాడారని కొనియడారు. కురుమలు ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు ముత్యాల కిష్టయ్య, జిల్లా, స్థానిక బాధ్యులు ప్రభాకర్, లక్ష్మీబాయి, నరేష్ యాదవ్, సంజీవ్‌యాదవ్, అంజయ్య, గోపాల్, వెంకట్, మారుతి యాదవ్, భూంగొండ, పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మల్‌శెట్టి, కురుమలు

ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు..



తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరిట ఏర్పాటైన బోర్డు

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చారు. మొదట్లో జిల్లాకు ఒక గ్రామీణ బ్యాంకు చొప్పున ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి చిమంజీరాలో గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేశారు. అనంతరం బ్యాంకు శాఖలు పెరగడంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులుగా మార్చారు. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం కూడా అదే పేరుతో సేవలు అందించారు. ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారు. దీంతో గత రెండు రోజులుగా గ్రామీణ బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. జనవరి 1నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో సేవలు అందించనున్నారు.

మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు సమీపంలోని కర్ణాటకలో గల మైలార్ మల్లన్న జాతర ఉత్సవాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. జనవరి 3 వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గణేష్ కుండ్, తెప్పాడ కుండ్, జ్యోతి లింగాలయం నుంచి తిరిగి ఆలయానికి చేరుకుంది. జహీరాబాద్‌ ఫొటోగ్రాఫర్ మధు బృందం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాష్ మైత్రే, కార్యనిర్వహణ అధికారి అనంత్‌రావు కుల్‌కర్ణి, ప్రధాన అర్చకులు బసప్ప హిరివాగ్గె, మేనేజర్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్ మధు బృందం

క్రీడలతో మానసికోల్లాసం

- మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి



క్యారమ్స్ ఆడుతున్న కార్మికులు

పటాన్‌చెరు టౌన్: కార్మిక సంక్షేమంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆదర్శంగా నిలుస్తుందని పటాన్‌చెరు మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని మైత్రిస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కార్మికులకు చెస్, క్యారమ్స్ పోటీలను హనుమంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పరిశ్రమలో 40 సంవత్సరాల పాటు ఒకే నాయకత్వంలో సీఐటీయూ అనుబంధంగా యూనియన్ కొనసాగడం, ఎక్కడా సాధ్యపడదన్నారు. వేతనాలు, సౌకర్యాలు సాధించడం అనేది అభినందనీయమన్నారు. కార్మిక సంక్షేమంతో పాటు అనేక సామాజిక, సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించడంలో జిల్లాలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అగ్రభాగాన నిలుస్తుందని కొనియాడారు. నిత్యం పనివత్తిడి ఎదుర్కొనే కార్మికులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. శాండ్విక్ యూనియన్‌కు భవిష్యత్తులో మైత్రి క్రికెట్ క్లబ్ నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మైత్రి క్రికెట్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, శాండ్విక్ యూనియన్ నాయకులు పాండురంగా రెడ్డి, మనోహర్, వీరారావు, హెచ్. వెంకట్రావు, సదాశివరెడ్డి, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

విశ్వపాలిని మందిరంలో చండీయాగం

కల్హేర్(నారాయణఖేడ్):నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని మందిరంలో ఆదివారం పంచదశ మాస చండీయాగం నిర్వహించారు. ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్-లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. ప్రముఖ జ్యోతిష్య వాస్తుశాస్త్ర పండితులు బ్రహ్మశ్రీ వక్కంతం చంద్రమౌళి శర్మ, ఎరకపల్లికు చెందిన దేవిదాస్ మహరాజ్ ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. మందిరంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అంకుశ్‌శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రలు పఠించారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రాములు, రూప్‌సింగ్, సవాయిసింగ్, మన్మోహన్‌సింగ్, మంజానాయక్ పాల్గొన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న మూడ్ కిషన్‌సింగ్

పార్ట్ టైం టీచర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ (ఆంగ్లం), టీజీటీ (తెలుగు) పోస్టుల్లో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియమాకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సోమవారం ఉ.10 గంటలకు నిర్వహించే డెమో తరగతులకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సదాశివపేటలో నేడు జాబ్‌మేళా

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణం సిద్దాపూర్ రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బంగ్లా భారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పరిశ్రమల ప్రతినిధులు ఈ జాబ్ మేళాకు హాజరుకానున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 6 సెట్ల రెజ్యూమ్, 2 ఫొటోలతో జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వట్‌పల్లి(అందోల్): పురుగుల మందు సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగులపల్లికి చెందిన సాయిలుగౌడ్(68), 20 ఏళ్లుగా షుగర్‌వ్యాధితో బాధపడుతూ ఈ నెల 28న పురుగుల మందు సేవించాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని న్యాయవాది నాగరాజు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బండ్లగూడ హనుమాన్ దేవస్థానంలో హనుమాన్ చాలీసా పారాయణం భక్తులతో కలిసి పఠించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలలో దేశభక్తి, దైవభక్తి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, విశ్వహిందూ పరిషత్ ప్రముఖ రామచంద్ర బజరంగదళ్, జిల్లా సహ సంయోజక్ మనోజ్ కుమార్, ప్రముఖ శిరీష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పట్టని నేతలు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ నాయకులకు పైసలపై ఉన్న శ్రద్ధ ఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధిపై లేదని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావడం, ఆ పార్టీ వారే ఖేడ్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఉన్నా చేసింది ఏమీ లేదన్నారు. తమ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ పనులను రద్దు చేసిందన్నారు. కొత్తగా రూ.15 కోట్లు మంజూరు చేసినా టెండర్లు వేసిన డబ్బులు ఇవ్వకపోవడంతో రద్దు చేయించారని ఆరోపించారు. తాము సమీకృత మార్కెట్, షాదీఖానా, ముస్లిం శ్మ శాన వాటికలకు రూ.30 లక్షలు మంజూరు చేసినా రద్దు చేశారన్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, కౌన్సిలర్ విఠల్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం

- ఎంపీ సురేష్‌షెట్కార్

కల్హేర్(నారాయణఖేడ్): ఖేడ్ ప్రాంతానికి స్పోర్ట్స్ స్కిల్ యూనివర్సిటీ రానుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పేర్కొన్నారు. ఆదివారం సిర్గాపూర్ మండల కేంద్రంలో స్వర్గీయ మల్లికార్జున్‌పాటిల్ స్మారకార్థం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాల పోత్సహిస్తుందని తెలిపారు. అనంతరం విజేతలకు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం సభ్యుడు నగేష్‌షెట్కార్, మాజీ సర్పంచ్ మనీష్‌పాటిల్, కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్‌రావు పాటిల్, నగేష్‌చారి, శివాజీపాటిల్, నందు పాటిల్, అఫ్రోజ్, మధు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ

ఉత్సవాల్లో ఎంపీ

నారాయణఖేడ్: భూంగొండేశ్వరకూడలి వార్షిక ఉత్సవాల్లో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నగేష్ షెట్కార్, కర్నె శ్రీనివాస్, అప్పారావు షెట్కార్ పాల్గొని భూంగొండేశ్వరుడి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ బాధ్యులు వారిని శాలువాలతో సన్మానించారు.

వక్ఫ్ బోర్డు సవరణను ఒప్పుకోం

- జమాతే ఉల్మ్ హింద్ అధ్యక్షుడు అజ్రత్ మౌలానా సయ్యద్ హజహర్ మదని

న్యాల్‌కల్ (జహీరాబాద్): వక్ఫ్‌బోర్డు సవరణను ఒప్పుకోబోమని జమాతే ఉల్మ్ హింద్ అధ్యక్షుడు అజ్రత్ మౌలానా సయ్యద్ హజహర్ మదని అన్నారు. ఆదివారం మండలంలోని హద్నూర్‌లో జమియత్ హింద్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోరాదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కుల, మతభేదాలు లేకుండా అందరు కలసికట్టుగా పోరాటాలు చేశారని, ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తయారు చేసిన రాజ్యాంగాన్ని మార్చకుండా కొనసాగించాలన్నారు. దేశ రక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాలకు చెందిన ముస్లిం పెద్దలు, మహమ్మద్ ఫారూక్ సాబ్, ఎండీ. జమీర్, మీర్ రజీయోద్దీన్ మక్సూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మదని

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జహీరాబాద్: సరస్వతి పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2002 బ్యాచ్‌కు పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రజతోత్సవంలో పూర్వ విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): సరస్వతి శిశుమందిర్ 1998–99 7వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పాఠశాలలో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందించారు. అనంతరం ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రపంచంలో అన్ని బందాల్లో స్నేహబంధం గొప్పదని చాలా రోజుల తరువాత ఇలా గడపడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అప్పటి పాఠశాల ప్రధానాచార్యులు కారం వీరయ్య, ఆంజనేయులు, అంజిరెడ్డి, బద్రప్ప, నర్సింలుగౌడ, కార్యాలయ సిబ్బంది నర్సింలు, సుశీల, విజయ్‌కుమార్ ప్రస్తుత ప్రధానాచార్యులు సంగమేశ్వర్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సదాశివపేట(సంగారెడ్డి): రజతోత్సవ వేడుకల్లో పూర్వ విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి పోరాటం

- రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు

సంగారెడ్డి జోన్: రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ట్రెసా అలుపెరుగని పోరాటం చేస్తుందని రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌రావుతో పాటు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లా ట్రెసా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. ట్రెసా కృషి వల్లే జూనియర్ అసిస్టెంట్ టు సీనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ టు నాయబ్ తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ టు తహసీల్దార్, తహసీల్దార్ టు డిప్యూటీ కలెక్టర్ ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం రెవెన్యూ శాఖను నిర్వీర్యం చేయాలని చూసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసి రైతులు, ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తుందని ఆ వైపుగా ఉద్యోగులు సహకరించాలని కోరారు. నూతన జిల్లా అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా ఎం. కిరణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు పి. దశరథ్, కోశాధికారిగా బాలరాజుతో పాటు 23 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంగారెడ్డి, నారాయణ్ ఖేడ్, జహీరాబాద్ డివిజన్ల రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నేతలు

గోమాత రక్షతో ప్రపంచ శాంతి

- గోవింద దేవ్ గిరిజి మహరాజ్

పటాన్‌చెరు: గోమాతను రక్షిస్తే ప్రపంచ శాంతి లభిస్తుందని అయోధ్య రామమందిర్ ట్రస్ట్ కోశాధికారి గోవింద దేవ్‌గిరిజి మహరాజ్ పేర్కొన్నారు. ఆదివారం అమీన్‌పూర్ పట్టణంలోని బీరంగూడలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి గోశాల 14వ వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోమాత పూజ, శాంతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ కోశాధికారి గోవిందా దేవగిరిజి మహరాజ్ మాట్లాడారు. ప్రాచీన భారతదేశంలో గోవుకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేవారన్నారు. మారుతున్న కాలంలో గో సంపద రోజురోజుకీ తగ్గిపోతుందని తెలిపారు. బీరంగూడలో గోసంరక్షణ చేస్తున్న ప్రతినిధులను అభినందించారు. అలాగే, ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరు గో సేవ చేయాలన్నారు. బీరంగూడ గోశాలలో 1200 ఆవులను సంరక్షించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్, రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, నాయకులు రఘునాథ్ రెడ్డి, మాణిక్ యాదవ్, ఆగారెడ్డి, గోశాల చైర్మన్ సోహన్ లాల్ ధైయిమా, అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్, ఉపాధ్యక్షులు సుగుదేవ్ జోషి పురుషోత్తం, కోశాధికారి రాజేందర్ తివారి, సభ్యులు పాల్గొన్నారు.



మహరాజ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు